సమిష్టి కృషితోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-గార : శ్రీకాకుళం జిల్లా వెనకబడలేదని, పాలకుల నిర్లక్ష్యం కారణంగానే వెనుకబాటుకు గురైందని, ఈ ప్రాంతంలో పుష్కలంగా నీటి వనరులు, లక్షలాది ఎకరాల సాగుభూములు, కష్టపడి పనిచేసే కార్మికులు సమృద్ధిగా ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం శూన్యంగా ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ పార్టీ నాయకులు చేస్తున్న బస్సు యాత్రను నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద శుక్రవారం జిల్లా సిపిఐ కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర అభివృద్ధి సదస్సును జిల్లా ఇన్‌చార్జి జే.వి.సత్యన్నారాయణ మూర్తి సభాధ్యక్షులుగా వ్యవహరించి, జిల్లా అభివృద్ధి గురించి పలు సమగ్ర విషయాలు కులంకుషంగా మాట్లాడారు. సదస్సును ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు జిల్లాను అభివృద్ధి చేస్తామన్న ఆలోచనలు లేకుండా ఉత్తరాంధ్రకు ప్రత్యేక రాష్ట్రాన్ని అడగడం అనేది హాస్యాస్పదమని అన్నారు. పాలకుల నాటకాలకు అడ్డుకట్టు వేయాలంటే ప్రతి ఒక్కరూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టాలన్నారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడ్డంకిగా మారిన ఇక్కడ పాలకుల వ్యవహారం విడ్డురంగా ఉందని అన్నారు. జిల్లాలోని మూలపేట ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టును సైతం అదాని, అంబానీలకు అప్పజెప్పిన రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ పబ్బం గడుపుకుంటుందని అన్నారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సృజల స్రవంతితోనే శ్రీకాకుళం జిల్లా సస్యశ్యామల మయ్యేదని, దానిని పాలకులు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ మాట్లాడుతూ చిరపుంజిలో ఎంత వర్షపాతం అయితే నమోదవుతుందో శ్రీకాకుళంలో కూడా అంతే వర్షపాతం నమోదు అవుతున్నప్పటికీ, ప్రాజెక్టులతో పాటు నదుల అనుసంధానంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా వెనుకబాటుకు జిల్లా గురవుతుందని అన్నారు. సిపిఎం నాయకులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ జీడి రైతుల మద్దతు కోసం అనేక సార్లు పోరాటాలు చేసినప్పటికీ పాలకుల్లో ఎటువంటి ప్రతిస్పందన లేదని ఆరోపించారు. జిల్లా అభివృద్ధి వ్యతిరేకులుగా పాలక పక్షం వ్యవహరిస్తుందని విమర్శించారు. ఐజేయు నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి అనేది అన్ని రాజకీయ, వ్యాపార, సామాజిక వర్గాల సమూహంతోనే సాధ్యమని అన్నారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేసే వారిని చరిత్ర క్షమించదని అన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కు అనేది ఆంధ్రులహక్కు మాత్రమే కాదని భారత దేశ హక్కు అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అన్ని సమృద్ధిగా ఉన్న శ్రీకాకుళం జిల్లా, నేడు వెనుకబడడం ఆక్షేపణీయమని అప్పలనాయుడు తెలిపారు. అంతకముందు సిపిఐ రాష్ట్ర నాయకులు బస్సు యాత్రగా సభా ప్రాంగణానికి చేరుకునే క్రమంలో ప్రజానాట్యమండలి సభ్యులు తమ ఆటపాటలు, విప్లవ గీతాలతో ప్రజలను ఉర్రూతలూగించారు.

ఈ కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి భాస్కరరావు, శ్రీకాకుళం జిల్లా సిపిఐ కార్యవర్గ, సమితి సభ్యులు డోల శంకరరావు, కొమర భాస్కరరావు, సనపల నర్సింహులు, గురుగుబెల్లి రాజేశ్వరరావు, లండ వెంకటరావు, చాపర సుందర్ లాల్, చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, నిమ్మాడ కృష్ణమూర్తి, డిహెచ్‌పి ఎస్ నాయకులు యడ్ల గోపి, అనపాన షణ్ముఖరావు, ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు చిక్కాల గోవిందరావు, పాల పోలారావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మొజ్జాడ యుగంధర్, కె.శ్రీనివాసరావు, చేతివృత్తిదారుల రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి నర్సింహమూర్తి, అల్లబోయిన అప్పలనాయుడు, కె.నారాయణ స్వామి, ఐ. లోకనాథం, ఏఐవైఎఫ్ నాయకులు జాన్సన్ బాబు, పరుచూరి రాజేంద్ర, రవి, పట్ట ప్రసాద్, కళ్యాణ అప్పలరాజుతో పాటు అన్ని ప్రజాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల స్పందనకు 26 అర్జీలు

పూర్తి స్థాయిలో సమస్య పై అవగాహన కలిగి ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఉద్యోగులు స్పందనకు వచ్చే ముందు సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి స్పందనకు రావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చెప్పారు. ప్రతీ నెల ఉద్యోగుల సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్‌లో స్పందన నిర్వహించారు. ఉద్యోగులు వివిధ సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. జీత, భత్యాలు అందలేదని, సీనియారిటీ, పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, తదితరమైన సమస్యలుపై అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల స్పందనలో 26 అర్జీలు స్వీకరించారు. ప్రతీ నెల నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగుల స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను జిల్లా స్థాయిలో అర్జీలు వస్తే సంబంధిత అధికారులకు పరిష్కారానికి పంపుతామని, రాష్ట్ర స్థాయిలో వచ్చిన అర్జీల సమస్యలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. అర్జీలు స్వీకరణలో ఇన్ చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ. రాజేశ్వరరావు, సెక్షన్ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రోడ్లు గుంతలమయం

జనసేన నాయకుడు డాక్టర్ దుర్గారావు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లన్నీ గుంతలమయంగా తయారై నడవడానికి సైతం ఆపసోపాలు పడే దుస్థితి ఏర్పడిందని జనసేన నియోజకవర్గం నాయకుడు డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో పూండిగల్లీ వద్ద నగరంపల్లి ఉన్నత పాఠశాలకు ఎదురుగా రోడ్డు పూర్తిగా ఛిద్రం కావడంతో జనసైనికులతో కలిసి శుక్రవారం గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి మీదుగా మండల కాంప్లెక్స్ నిత్యం రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఎదురుగా పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. టెక్కలిపట్నం నుండి నువ్వలరేవు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం అంటూ ఊదరగొడుతున్న పాలకులు అది ఎప్పటికి మొదలవుతుంది వారికే తెలియాలని ఎద్దేవా చేసారు. రోడ్ల దుస్థితిపై రాష్ట్రవ్యాప్తంగా జనసేన యుద్ధభేరి మోగిస్తుంది అన్నారు. రోడ్ల తో పాటు వంశధార శివారు భూములకు సాగునీరు గత నాలుగేళ్లుగా అందించలేని ప్రభుత్వ నిర్లక్ష్యంపై జనసేన పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు లావేటి సురేష్, దువ్వాడ వంశీచౌదరి, విజయ్‌కుమార్, చింత మాధవరావు, బెహరా పద్మనాభం, వనజంగి ధనుంజయ్, పసుపురెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల చరిత్ర గల పాఠశాలలో... ముగ్గురు విద్యార్థులు

విశాలాంధ్ర-పలాస : బ్రిటిష్ పరిపాలన కాలం నుంచి ప్రస్తుతం వందేళ్ల పైబడిన ఆ పాఠశాలలో పలాస కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు పరిసర ప్రాంత వాసులంతా చదువుకున్నారు. ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. పూర్వం సమితి కాలంలో దివంగత ప్రధానోపాధ్యాయులు నంబాళ్ల తిరుపతిరావు హయాంలో పాఠశాల ఎంతో అభివృద్ధి చెంది ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 400 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. అలాంటి చరిత్ర గల పాఠశాలలో కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం విచిత్రం. కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి నేడు దయనీయంగా మారింది. ఎంతో వైభవం గల ఆ పాఠశాల అభివృద్ధికోసం నేటి పాలకులు దృష్టిసారించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఉన్న పాఠశాల భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోగా నూతనంగా నిర్మించిన పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు మాత్రమే చదువుకోవడం బాధాకరం. వందేళ్ల నిండిన సందర్భంగా ఎంతో అర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించినా అధికారులు పాఠశాల ప్రాంతంలో నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ఏడాది క్రితం పాఠశాల ఆవరణలో రైతు బజారు ఏర్పాటు కోసం రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవ తీసుకున్నా కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నాడు నేడు పథకం ద్వారా నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్న నేపథ్యంలో చరిత్ర కలిగిన పాఠశాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని, ఎంతో విలువైన ప్రభుత్వ స్థలంను కాపాడాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. విద్యార్థుల విషయమై పలాస మండల విద్యాశాఖాధి కారి సి.హెచ్.శ్రీనివాస రావును వివరణ కోరగా పాఠశాలలో ఏకోపాధ్యాయుడుతో పాటు 19 మంది విద్యార్థులున్నట్లు ఆయన తెలిపారు.

పాము కాటుకు పోలీస్ అసిస్టెంట్ మృతి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం కాపు గోదాయవలస గ్రామానికి చెందిన తామాడ జ్యోతి పాముకాటుకు గురై మృతి చెందారు. ఈమె కోటబొమ్మాళి మండలంలో సచివాలయంలో పోలీస్ అసిస్టెంట్ గా పని చేస్తున్నారు. స్వగ్రామమైన సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామంలో శుక్రవారం ఉదయం పాముకాటుకు గురయ్యారు. ఈమె మృతి పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఓటర్ల సర్వేపై కలెక్టర్‌ను అభినందించిన ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా చేపట్టిన ఇంటింటా సర్వేలో శ్రీకాకుళం జిల్లా దాదాపు 90 శాతం పూర్తిచేయడం పట్ల జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అభినందించారు. మిగిలిన పది శాతం కూడా రానున్నమూడు రోజుల్లో పూర్తిచేసి శతశాతం పూర్తిచేయాలని ఆకాంక్షించారు. ఇంటింట ఓటర్ల సర్వేపై జిల్లా కలెక్టర్లతో శుక్రవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింట సర్వేను వేగవంతం చేయాలని, సర్వే పూర్తయ్యేందుకు ఇంకా మూడు రోజుల గడువు మాత్రమే ఉన్నందున త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఫిజికల్ సర్వే ముగిసిన పిదప బి.ఎల్.ఓల యాప్ లో నమోదుచేయాలని సూచించారు. ఒక ఇంటిలో 10 కన్నా ఎక్కువ ఓటరులు ఉంటే తనిఖీ చేయాలి. ఒక వ్యక్తి ఓటర్ల తొలగింపునకు ఫార్మ్ 7లను5 కన్నా ఎక్కువ ఇస్తే , పరిశీలించాలి. తప్పుడు ఫార్మ్ 7లను పెట్టిన వారి మీద కేసులు నమోదు చేయాలి. ఓటర్ల తొలగింపుకు ముందు సంబంధిత వ్యక్తుల ఇళ్లకు రిజిస్టర్ పోస్టు ద్వారా ముందస్తు నోటీసు జారీచేయాలని, నోటీస్ జారీఅయిన 15 రోజుల పిదప నిర్ధారించుకొని తొలగింపులు చేయాలని స్పష్టం చేసారు. 2022 జనవరి 6 నుండి 2023 ఆగష్టు 10వరకు జరిగిన తొలగింపు ఓటర్ల జాబితాలను పునఃపరిశీలించి ఆ తదుపరి మాత్రమే చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 5,87,150 గృహాలకు గాను 5,26,294 గృహాలను సందర్శించి దాదాపు 90 శాతం సర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. అలాగే ఇంటింట సర్వేలో 18 లక్షల 6వేల 841 మంది ఓటర్లకు గాను 10,164 మంది ఓటర్లు మరణించినట్లు నిర్ధారించడమైందని చెప్పారు. ప్రతి ఇంటిని సర్వే చేయించి సందేహం ఉన్నచోట అధికారులతో పునఃపరిశీలన చేయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 90 శాతం సర్వే పూర్తయినందున మిగిలిన మూడు రోజుల్లో మిగిలిన 10శాతం సర్వేను పూర్తిచేసి, శతశాతం సర్వే పూర్తిచేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవిన్యూ అధికారి పి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : బాతుపురం ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహించి బదిలీపై చిన డోకులపాడు పాఠశాలకు వెళ్తున్న గనియా ఢిల్లేశ్వరరావు ను శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతోపాటు పాఠశాల అభివృద్ధిలో తనవంతు భూమిక పోషించి, పాఠశాల నుండి విద్యార్థులను పోటీలకు పంపించి వారిలో నిబిడీకృతంగా ఉన్న ప్రతిభను వెలికితీసి ఎన్నో బహుమతులు తీసుకొచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దారని పలువురు వక్తలు కొనియాడారు. సన్మాన గ్రహీత ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యానంలో ఉపాధ్యాయుడుగా పనిచేయాలని ప్రతి ఉపాధ్యాయుడు ఎందుకు కోరుకుంటారో మీ ఆదరణ చూసిన తరువాత తెలిసింది అన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం ఉద్యానం ప్రజలకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని, మీ మన్ననలు చిరకాలం గుర్తించుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బత్తిన లక్ష్మినారాయణ, హెచ్ఎంలు సుభాష్ చంద్రబోస్, మీనాక్షి, రెయ్యి ఢిల్లేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్‌లు చెల్లూరు నీలకంటేశ్వరరావు, తామాడ ప్రదీప్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తామాడ సురేష్, మాజీ సర్పంచ్ తామాడ అప్పలస్వామి, బత్తిన మోహనరావు, తామాడ తులసీదాసు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నల్లి ధర్మారావు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-గార : ప్రముఖ రచయిత, కవి, సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు 67వ పుట్టినరోజు వేడుకలు శ్రీకాకుళం నగరంలోని ఘనంగా జరిగాయి. ఈమేరకు శ్రీకాకుళం నగరంలోని దాసరి నాగభూషణ్ కాంతి భవన్ తోటి పాత్రికేయులతోపాటు ఆయన అభిమానుల అధిక సంఖ్యలో హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉత్తరాంధ్ర అభివృద్ధి సదస్సులో ఆహ్వానితుడిగా ఉన్న ఆయనను రాష్ట్ర సిపిఐ కార్యదర్శి కే రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ, సిపిఐ పార్టీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి జేవి సత్యన్నారాయణ, జిల్లా టిడిపి అధ్యక్షులు కూన రవికుమార్, జిల్లా సిపిఐ కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, రచయిత అట్టాడ అప్పలనాయుడు, భవిరి కృష్ణ మూర్తి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నల్లి ధర్మారావు మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకొని తన రచనలతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు.

మరువాడ పంచాయతీలో నా భూమి నా దేశం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీలో అమృత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా, నా భూమి నా దేశం కార్యక్రమ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసరాజు, మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు, మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల వైస్ ఎంపీపీ సూరాడ భీమారావు, మరువాడ పంచాయతీ వైకాపా ఇన్చార్జి గంట ఈశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ధనంజయరావు, వేతనదారులు పాల్గొన్నారు.

చిన్నారి ఆధ్యకు పలువురు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన యాంద్రాపు చిరంజీవి,అంజలి దంపతుల తొమ్మిది నెలల కుమార్తె ఆధ్య హెచ్ఎల్ హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతుంది. ఈ సందర్భంగా పలువురు దాతలు తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన యాదవులు సామాజిక వర్గం తరపున ఆధ్యకి అండగా నిలిచి 40 వేల 316 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గం పెద్దలు కొర్రాయి వాసుదేవరావు,చందాన తెజేశ్వర రావు, బదకల యర్రయ్య,బదకల లక్ష్మణ్, బదకల ప్రసాద్,బోరుభద్ర మోహన్,కాకర్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు. కవిటి ఉషోదయ సంఘం మరో అడుగు ముందుకేసి సంఘ సభ్యులు వారి మిత్రుల ద్వారా 15వేల500 రూపాయలు శ్రీ చింతామణి ఆటో యూనియన్ సభ్యులు 5వేలు రూపాయలు మొత్తం 20వేల500 రూపాయలు ఆధ్య తాతయ్య,నాన్నమ్మలకు ఆర్థిక సహాయాన్ని ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్ మాజీ సర్పంచ్ ఆరంగి మధు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరంగి రాజు,పి వెంకట రావు,పి ఉమ మహేశ్వరరావు,టి మోహన్ రావు,ఆర్ వెంకట రావు,మదన్ రౌలో , పందిరి దశ,వంజరాన నారాయణ,చందు, ఉషోదయ సంఘం సభ్యులు,ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. కుసుంపురం కేంద్రంగా పనిచేస్తున్న మాతృమూర్తి యువజన సేవా సంఘ సభ్యులు 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఆధ్య వైద్య ఖర్చుల నిమిత్తం చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జుత్తు చలపతి, కార్యదర్శి అంగ సురేష్, బి.భాస్కర్,యన్ నాగేశ్వరరావు,కుర్మారావు,లోళ్ళ ధనుంజయం,మాధవ్, కేత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇనామ్ భూమి లెక్క తేలేది ఎన్నడు..?

వెంకయ్య పేటలో తహసిల్దార్ గ్రామసభ

విశాలాంధ్ర-ఆముదాలవలస : ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధి వెంకయ్యపేట రెవెన్యూ పరిధిలోని ఇనామ్ భూముల లెక్కను తేల్చేందుకు శుక్రవారం తాసిల్దార్ గణపతి రావు ఆధ్వర్యంలో వెంక య్య పేట రైతులతో గ్రామసభ నిర్వహించా రు. సర్వే నెంబర్ 1 నుండి 104, వరకు 308 ఎకరాల ఇనామ్ భూమికి సంబంధించి హక్కుదారకు 30 శాతాన్ని అందించాలని తాసిల్దార్ రైతులకు వివరించారు. అందుకు రైతులు సుశామీర అంటున్నారు. 22 ఏ లో సెక్షన్ రెండు, మూడు, ఇనాం యాక్ట్ ప్రకారం 25 సంవత్సరాల పైబడి చేసిన సాగు రైతుకు 70శాతం భూ హక్కుదారులకు 30 శాతం భూమిని కేటాయించాలని యాక్ట్ చెబు తుంది. ఇటీవల భూ యజమాని దూర్వా సులు కుటుంబానికి సంబంధించి వారు కుదుర్చుకున్న వడంబడిక మేరకు ఇవాళ జిల్లా కలెక్టర్ ను కలిసి వారి భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు కోరారు. ఇనాం దారులు సొంత లాయర్ సహకారంతో తమ భూములు కేటాయించాలని కలెక్టర్కు చేసు కున్న అర్జీ మేరకు రెవెన్యూ అధికారులు స్పందించారు దీంతో గ్రామ సభ నిర్వహించిన రెవిన్యూ అధికారులు రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. లక్ష్ముడిపేట, వెంకయ్యపేట, అచ్చంపేట, రావికండిపేట, కొర్లకోట గ్రామాలకు చెందిన రైతులు ఈ భూములను సాగు చేస్తున్నారు. రైతులందరూ రాజీ మార్గానికి వస్తే సమస్య సత్వరమే పరిష్కారమవుతుందని రెవిన్యూ అధికారులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ భూ హక్కుదారకు సుమారు 100 ఎకరాలకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకాలు చట్టరీత్యా మంజూరు చేయాల్సి ఉంది.

పెన్షన్‌దారుల నూతన భవనం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటలో పెన్షన్‌దారుల నూతన భవనం శుక్రవారం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, జెడ్పీటీసీ తడక యశోద, ఎంపీపీ నిమ్మన దాసు, సోంపేట మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షులు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘ భవనం నిర్మాణం కొరకు జెడ్పీ నిధులు మంజూరు చేసినందుకు చైర్‌పర్సన్ విజయకు, జెడ్పీటీసీ యశోదకు పండి కృష్ణారావు, వివిధ రిటైర్డ్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

లోక్‌అదాలత్‌పై సమావేశం

విశాలాంధ్ర-సోంపేట : శ్రీకాకుళం ఫ్యామిలీ కోర్టు జడ్జి పి.భాస్కరరావు, చైర్మన్ మండల న్యాయసేవాధికార సంఘం మరియు 6వ అదనపు జిల్లా జడ్జి ఆధ్వర్యంలో సోంపేట కోర్టులో లాయర్లు, సోంపేట, కంచిలి, మందస, బారువ పోలీసు సిబ్బందితో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్‌అదాలత్‌ను ఉద్దేశించి శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పోలీసులను, లాయర్లను సెప్టెంబర్ 9న జరుగు జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలని వారిని కోరారు. ఈ సమావేశంలో జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.రాము పాల్గొన్నారు. ఎస్సైలు, ఎఎస్సైలు, లాయర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాలి

- ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో ఖరీఫ్ ప్రారంభమైనందున విత్తనాలు, ఎరువులు, కొనుగోళ్లు తదితర అంశాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ధాన్యం కొనుగోళ్ల కమిటీ సమావేశం (డిపిసి) జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఖరీఫ్ లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణలో సంబంధిత అధికారులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతులు ఏరకమైన వరి వంగడాలను వేసినప్పటికి, మంచి ధాన్యం ఉంటే వాటిని ప్రభుత్వం ఖచ్చితంగా కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. గత నాలుగేళ్లుగా జిల్లాలో ధాన్యం కొనుగోలు బాగా జరుగుతుందని కితాబిచ్చారు. గతంలో జరిగిన లోపాలను సమీక్షించుకుని ఈసారి మరింత మెరుగ్గా ధాన్యం కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గతంలో సీజన్ ముగిసినప్పటికీ ధాన్యం సేకరణ కొన్నిచోట్ల పూర్తికాలేదని ఫిర్యాదులు వచ్చాయని, అటువంటివి ఈసారి పునరావృతం కారాదని జెసి స్పష్టం చేశారు. ఈసారి 9లక్షల 60వేల మె.ట ధాన్యం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినందున, అందుకు తగినవిధంగా గోనెసంచులు, రవాణా, హమాలీలు, ధాన్యం సేకరణ కేంద్రాలు, ఎక్విప్ మెంట్ తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. గతంలో 71 రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా వినియోగించడం జరిగిందని, ఈసారి మరిన్ని ఆర్.బికెలను పిపిసిలుగా మార్చనున్నట్లు చెప్పారు. ఖరీఫ్ నందు లభ్యమయ్యే పంట అంచనాలలో ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. పిపిసిలకు అవసరమైన సిబ్బందిని జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ప్రభుత్వమే నియమించి కేటాయించడం జరుగుతుందని, వారికి ప్రభుత్వమే చెల్లింపులు చేస్తుందని వివరించారు. అలాగే జిల్లాలోని ధాన్యం మిల్లులను అధికార బృందం పర్యవేక్షిస్తుందని, వాస్తవంగా మిల్లులకు ఉన్న కెపాసిటీ ఆధారంగా ధాన్యం కేటాయించడం జరుగుతుందని, తద్వారా సకాలంలో మిల్లింగ్ జరుగుతుందని జెసి అభిప్రాయపడ్డారు. ఖరీఫ్ లో పండే ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు దువ్వాడ శ్రీనివాస్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, ఎల్.డి.ఎం ఎం.సూర్య కిరణ్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.ప్రసాదరావు, మత్స్య, పశుసంవర్ధక శాఖల సంయుక్త సంచాలకులు డా.పి.వి.శ్రీనివాసరావు, డా.ఎం.కిషోర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలుషితమైన తాగునీరు వలన పలు అనారోగ్య సమస్యలు

- శుద్ధి చేసిన నీటిని ప్రతి ఇంటికి కుళాయి ద్వారా అందివ్వటమే లక్ష్యం
- ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశుభ్రమైన త్రాగునీరు అత్యావశ్యకం
- ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జన జీవని మిషన్‌లో భాగంగా సరుబుజ్జిలి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. శాస్త్రుల పేట గ్రామంలో సుమారు 45 లక్షల నిధులతో, కూన జమ్మన్నపేట గ్రామంలో సుమారు 43 లక్షల నిధులతో, చిన్న సలాంత్రి గ్రామంలో 32 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మర్రిపాడు గ్రామంలో సుమారు 21 లక్షల నిధులతో మరియు బురిడివలస గ్రామంలో సుమారు 38.50 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా పనులు పూర్తి చేసిన ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మానవ జీవితంలో ఆహారంతోపాటు స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకమైనవిగా పేర్కొన్నారు. స్వచ్ఛమైన త్రాగునీరు సేవించుట ద్వారా అనారోగ్యలకు దూరంగా ఉండవచ్చున్నారు. ఫ్లోరైడ్ లావణాలు కలిసి ఉన్న నీటిని త్రాగేవారు ఫ్లోరోసిస్ వ్యాధులు భారిన పడుతున్నారని తెలిపారు. గతంలో కొన్ని చోట్ల మాత్రమే ఫ్లోరైడ్ లవణాలు ఉన్న నీరు లభ్యం కాగా, ప్రస్తుతం పలు చోట్ల లవణాలుతో కలిసి ఉన్న నీరు లభించే పరిస్థితిలు ఏర్పడ్డయాన్నారు. ఇట్లాంటి తరుణంలో రాష్ట్రంలో పలు గ్రామాల్లో, పట్టణాల్లో, నగరాల్లో భూ అంతర్భాగం నుండి గానీ, సమీప ప్రవాహ నదుల్లో నుండి గానీ నీటిని అందిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. ఆ నీటిలో అనారోగ్యం కలిగించే లవణాలను, కారకాలను ప్రత్యేక పద్ధతుల్లో తొలిగించడం జరుగుతుందన్నారు. శుద్ధి చేసిన నీటిని కొళాయిలు ద్వారా ఇంటింటికి త్రాగునీరు కోసం అందించడమే పథకం యొక్క అంతిమ ఉద్దేశ్యం అన్నారు. ఇందులో భాగంగా జల జీవన్ మిషన్ ద్వారా త్రాగునీటి కల్పనకు చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కేవిజి సత్యనారాయణ, జడ్పిటిసి సురవరపు నాగేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలాపు చంద్రశేఖర్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బద్రి రామారావు, ఎస్సీ సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, స్థానిక సర్పంచులు బెండి అప్పల నాయుడు, బత్తిన వరలక్ష్మి, కొవిలాపు గౌరి నాయుడు, స్థానిక సర్పంచ్ ప్రతినిధి మునకల సూర్యారావు, తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

– రోడ్లపైనే వాటర్ పైపులు..! ప్రజా అవసరాల కోసమా...? బిల్లుల కోసమా..? సరుబుజ్జిలి మండలంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి మంచినీటి కొళాయిలు వేయడం జరుగుతుంది. పథకాల ప్రజా ఉపకారం అయినప్పటికీ...! స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతిఫలాలు కొన్ని రోజులు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేలా కనిపిస్తున్నాయని టిడిపి మండల యువ నాయకుడు కూటికుప్పల కోటేశ్వరరావు తెలిపారు.. జర్జంగి జగన్నాధపురం రోడ్డు మంజూరు జరిగిందని స్థానిక నాయకులు చాలాసార్లు చెప్పడం జరిగింది. ఒకవేళ మంజూరు వాస్తవమే అయినప్పుడు...! జేజే రోడ్డులో సరుబుజ్జిలి నుండి కొమనాపల్లి వరకు రోడ్డుకు అనుకున్న గ్రామాలైన సరుబుజ్జిలి, కూన జమ్మన్నపేట, వీరభద్రపురం మరియు శాస్త్రుల పేట గ్రామాలలో రోడ్డు పక్కనే జలజీవన్ పథకాల సంబంధించినటువంటి వాటర్ పైపులు వేయడం వల్ల లక్షల మొత్తం ప్రభుత్వానికి నష్టం చేకూరి అవకాశం ఉందా...? లేదా...? ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని స్థానికులు తెలియజేస్తున్నారు. ఈ రహదారిలో గల అన్ని గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని, దీనివల్ల దీర్ఘకాలంగా పొందవలసిన ప్రయోజనాలకు చిల్లు పడుతుందని స్థానికులు తెలియజేస్తున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడవలసిన బాధ్యత మండల స్థాయి అధికారులకు ఉన్నప్పటికీ, వారి తీరు బాధ్యతాయుతంగా కనిపించడం లేదని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని టిడిపి మండల యువ నాయకుడు కూటికుప్పల కోటేశ్వరరావు తెలిపారు.

టీడీపీలో కుమ్ములాటలు... వైసీపీలో అసమ్మతి వర్గాలు..?

పలాస నియోజకవర్గంలో రసవత్తరంగా అసెంబ్లీ ఎన్నికలు

విశాలాంధ్ర-పలాస : పలాస నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. గతంలో పోటీ చేసిన అభ్యర్థులే (టీడీపీ గౌతు శిరీషా, వైసీపీ డాక్టర్ సీదిరి అప్పలరాజు) తిరిగి పోటీ చేసే పరిస్థితులు గోచరిస్తున్నాయి. వచ్చే ఏడాదిలో పార్లమెంటుకు, అసెంబ్లీకి ఏకాలంలో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయన్న సంకేతాలు ముందస్తుగానే సమాచారం ఉండడంతో ఆయా పార్టీలు అప్రమత్తమయ్యాయి. టీడీపీలో కుమ్ములాటలతో పాటు వైసీపీలో అసమ్మతి నాయకుల తలనొప్పి ఉన్న తరుణంలో వైసీపీ అధిష్టాన వర్గం అదేశాల మేరకు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పేరుతో నియోజకవర్గంలో అనేక గ్రామాలు తిరుగుతూ ప్రజలతో మమేకవుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పలాస నియోజకవర్గ పరిస్థితులు రోజురోజుకు మారుతూ అంచనాలకు అందకుండా పోతోంది. వచ్చే ఎన్నికల్లో గత మెజార్టీ కన్నా మరింత ఎక్కువ మెజార్టీతో గెలుస్తామన్న ధీమాతో ఉన్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రణాళిక బద్దంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 60శాతం పూర్తి చేసిన మరో 40శాతం అసంపూర్తిగా మిగిలి ఉందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికే ఉద్దాన ప్రాంతంలో రహదారుల నిర్మాణాలు, నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నూతన సచివాలయ కార్యాలయాలు, కొత్త తుఫాన్ భవనాల నిర్మాణాలు చేపట్టారు. అలాగే 700 కోట్ల రూపాయలతో ఇంటింటికి మంచినీటి పథకం, కిడ్నీ ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధం చేశారు.అయితే ఎన్నికల్లోగా అఫ్‌షోర్ రిజర్వాయరు పనులు, పలాస రైల్వే వంతెన, కాశీబుగ్గ రైతు బజారు ఏర్పాటు వంటి హామీలు నెరవేరే పరిస్థితులు కానరావడం లేదు. అయినా ప్రజల ఆశీస్సులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పల రాజుకు ఉన్నాయన్న ధీమాతో అయన ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమంతో ప్రజలకు కలుసుకునే పరిస్థితులు ఏర్పాటు చేసుకున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషా తండ్రి మాజీ ఎమ్మెల్యే శివాజీ సూచనలతో నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజల వద్దకు వెళ్తున్నారు. గత ఎన్నికల తరువాత నియోజకవర్గానికి దూరంగా ఉన్న శిరీషా 6 నెలల నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తూ టీడీపీ కార్యకర్తలకు ఎటువంటి అపద వచ్చినా వెంటనే అక్కడకు చేరుకొని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కారణమంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. తన ప్రత్యర్థి గౌతు శిరీషా అయితే తన గెలుపు నల్లేరుపై నడకలా ఉంటుందని డాక్టర్ సీదిరి భావిస్తున్నారు. అయితే జనసేన, టీడీపీ పొత్తు కుదిరితే జనసేన ఓటు బ్యాంక్ షేర్ టీడీపీకి కలిసే అవకాశాలు ఉండడంతో పోటీ రసవత్తరంగా ఉండే పరిస్థితులు నెలకొన్నాయి.

నియోజకవర్గంలో కులాల బలాబలాలు : పలాస నియోజకవర్గంలో కులాల వారిగా చూసుకుంటే అత్యధికంగా కాళింగులు (54వేలు) ఓట్లు ఉండగా తరువాత స్థానంలో అగ్నికుల క్షత్రియులు, యాదవులు, వాడబలిజలు ఓటర్లు ఉన్నారు. డాక్టర్ సీదిరి అప్పలరాజుకు చెందిన సామాజిక వర్గానికి 2వేల ఓట్లు లోపలే ఉండగా శ్రీశయన (సెగిడి) ఓటర్లు 3శాతం మందే ఉన్నారు. అయితే అభ్యర్థుల కులాల పరంగా తక్కువ ఓట్లు ఉన్నా మిగిలిన కులాల ఓట్లుపై ఇరు అభ్యర్థులు ఆధార పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో కొన్ని కులాలకు ప్రాధాన్యత కరువ్వడంతో ఆయా కులాలకు చెందిన వారు సమయం కోసం వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వ్యాపార వర్గాలవారు కూడా నివురుగప్పిన నిప్పులా ఉండి ఎన్నికల సమయంలో తమ ప్రతాపం చూపేందుకు సిద్ధమవుతున్నారు. అక్టోబరు నెల తరువాత మూకుమ్మడిగా నాయకుల వలసలు ఊపందుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే మంతనాలు పూర్తి అయినట్లు బోగటా. ఇదిలా ఉండగా వైసీపీ పాలనలో కక్ష సాధింపు చర్యలు, చిన్న విషయాన్ని సోషల్ మాంద్యంలో ట్రోల్ చేయడం వలన పార్టీకి నష్టం వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి గ్రామంలో రెండు గ్రూపులు తయారు చేయడం వలన రాబోయే ఎన్నికల్లో ఒక గ్రూపు బడబాగ్నిల విరుచుపడి తీవ్రమైన ప్రతికూలత ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు మున్సిపాలిటీలో కబ్జాల పర్వం కొనసాగింపు, వసూల్ రాజాలు విజృంభించడం, జిరాయితీ భూములను తప్పుడు సర్వే నెంబర్లుతో ద్వితీయ శ్రేణి నాయకులు కబ్జాలు చేయడం వంటి అంశాలు అధికార పార్టీకి శిరోభారంగా తయారయ్యాయని పరిశీలకులు భావిస్తున్నారు. టీడీపీలో గౌతు శిరీషా భర్త వెంకన్న చౌదరి ఎన్నికల సమయంలో చురుకుగా పాల్గొంటే నియోజకవర్గ ప్రజలు ఆయనను సమర్థించే పరిస్థితులు కనిపించడం లేదని, టీడీపీకి అయన మైనస్ అయ్యే పరిస్థితులు ఉండవచ్చుని పలువురు పేర్కొంటున్నారు. ఏదిఏమైనా జిల్లాలో పలాస నియోజకవర్గం కేంద్ర బిందువుగా మారే పరిస్థితులు గోచరిస్తున్నారు.

ఆశ్రమానికి వాషింగ్ మిషన్ వితరణ

విశాలాంధ్ర-హిరమండలం : మండలకేంద్ర మైన హిరమండలం 2 సచివాలయ సమీపంలోని ప్రేమ సాయి వృద్ధాశ్రమానికి శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.అనురాధ మేడం, వారి సోదరీమణులు శశికళ, వరలక్ష్మి, తులసీ రత్నం, భారతి, సుజాత, వారి సోదరుడు గోపాలకృష్ణ ల సహకారంతో వారి తల్లిదండ్రులు ఎం కూర్మయ్య, లక్ష్మీనారాయణమ్మ ల జ్ఞాపకార్థం ఆశ్రమ వాసుల సౌకర్యార్థం రూ.20వేలు విలువ చేసే వాషింగ్ మిషన్ ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ఆశ్రమానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, ఆశ్రమ అభివృద్ధిలో తనను భాగస్వామి చేసినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కోఆర్డినేటర్ ఎస్ సాయిబాబా, జోషుల గోవింద శర్మ, చంటి మాస్టారు, మేనేజర్ కె జయరాం ఆశ్రమ వాసులు కే నరసింహమూర్తి, పి పోతయ్య తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కారానికే ప్రాధాన్యత

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : సిబ్బంది సమస్యలు పరిష్కారానికే ప్రాధాన్యత ఇచ్చి సమస్యలు పరిష్కరించబడుతున్నాయిని జిల్లా ఎస్పీ జిఆర్. రాధిక తెలిపారు. ప్రతి నెల మూడవ శుక్రవారం పోలీసు సిబ్బంది, మినిస్ట్రీయల్ స్టాఫ్ యొక్క సమస్యలపై గ్రీవిన్స్ డే నిర్వహించడం విదితమే. ఈ క్రమంలో జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ గ్రీవిన్స్ డే కార్యక్రమంలో వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది వ్యక్తిగత, ఇతరత సమస్యలపై అర్జీలను ఎస్పీ సమర్పించగా,ఎస్పీ స్వయంగా అర్జీలను స్వీకరించి, క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందించి,వాటిని త్వరితగతిన పరిష్కరించబడతాయని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిరంతరం విధినిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది సంక్షేమమే ప్రధాన లక్ష్యమని, వృత్తిపరంగా, ఆరోగ్యపరంగా పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామన్నారు.పోలీసు సిబ్బంది వారి సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన యెడల తక్షణం పరిష్కరించటం జరుగుతుందని, కావున సమస్యలు ఉన్న పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలియజేశారు.

పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : అంధ్రప్రదేశ్ హైకోర్టు జువెనైల్ జస్టిస్ కమిటీ సూచనల మేరకు శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవా సదన్‌లో జువెనైల్ జస్టిస్ కమిటీ హై కోర్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆదేశాల మేరకు జువెనాయిల్ జస్టిస్ యాక్ట్ డీల్ చేసే మెంబర్స్ అందరికీ వర్క్షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ పిల్లల ప్రవర్తన పై పెద్దలందరూ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తల్లిదండ్రులు వ్యక్తిగత బాధ్యత వహించి పిల్లల ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. కేసులు డీల్ చేసే అన్ని డిపార్ట్మెంట్లు వాళ్ళు వ్యక్తులు కూడా పిల్లవాడు చట్టంతో విభేదించడానికి గల కారణాలను శోధించి లోతైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పిల్లలు చట్టంతో విభేదించకుండా నిరోధించాలంటే తగు సూచనలు చేయాలని అందరిని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాధిక, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్ సన్యాసినాయుడు, జువెనలు జస్టిస్ యాక్ట్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ శారదాంబ, జస్టిస్ బోర్డ్ మెంబర్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్స్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ ఇన్చార్జి అధికారి కే వెంకటేశ్వరరావు, జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి కే ప్రకాష్ రావు, డిస్టిక్ ప్రొఫెషన్ ఆఫీసర్ బివి రవికుమార్, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమణ, పెద్ద సంఖ్యలో పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జేజేబి పి సుశీల, లేషన్ ఆఫీసర్ లక్ష్మణరావు, డీఎస్పీలు పాల్గొన్నారు.

750 గ్రాముల బంగారం డిపాజిట్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి దేవస్థానంకు భక్తుల సమర్పించిన 750 గ్రాముల బంగారాన్ని విశాఖపట్నం స్టేట్‌బ్యాంకులో గోల్డ్‌బాండ్ స్కీం ద్వారా డిపాజిట్ చేయడం జరిగిందని కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ శుక్రవారం తెలిపారు. రాజమేహేంద్రపురం బంగారు అభరణాల తనిఖీ అధికారి ఎం.వి.సురేష్ బాబు, విశాఖపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారుల సమక్షంలో ఈ డిపాజిట్ చేయటం జరిగిందని ఆయన తెలిపారు.

9న జాతీయ లోక్ అలత్

విశాలాంధ్ర-పలాస : జాతీయ లోక్ అధాలత్‌ను సెప్టెంబరు 9వ తేదీన పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి ఎస్.హెచ్.ఆర్ తేజా చక్రవర్తి మల్లా తెలిపారు. శుక్రవారం న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ లోక్ అధాలత్‌కు హాజరయ్యే కక్షిదారుల మధ్య రాజీ సూత్రంతో కేసులు పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకుంటామని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అధాలత్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఎన్నో ఏళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు కాలం, ధనం వృదా అవుతుందని లోక్ అధాలత్‌ను ఉపయోగించుకొని రాజీ ద్వారా వాటిని కాపాడుకోవచ్చని అన్నారు. సాంఘిక, సామాజిక అభివృద్ధికి కక్షిదారులు లోక్ అధాలత్‌ను ఉపయోగించుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో పలాస బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చక్ర ధర ఆలయంలో కుంకుమ పూజలు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు సత్యం స్వామి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజామున స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మహిళలు పాల్గొని కుంకుమ పూజలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రతి ఏట శ్రావణ మాసం మొదటి శుక్రవారం కుంకుమ పూజలు స్వామి వారి సన్నిధానంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ఈ పూజలు వివాహం కాని కన్యలు కుంకుమ పూజలు చేయటం వల్ల వివాహం జరుగుతుందని తెలిపారు.అలాగే ముత్తయిదువులు ఈ పూజలు నిర్వహించడం వల్ల అష్ట ఐశ్వర్యాలు భోగభాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పొందల కృష్ణారావు,పొందల వెంకట శ్రీ రాంబాబు,ఆలయ అర్చకులు రాజు స్వామి, రాజేష్ స్వాములు పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైన్‌లో మహిళలకు శిక్షణ : ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు

విశాలాంధ్ర-ఆముదాలవలస : ఫ్యాషన్ డిజైన్‌లో మహిళలకు శిక్షణ ఎందిస్తున్నట్లు ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. మహిళలకు బ్లాక్ పెయింటింగ్ మరియు మగ్గం వర్క్ పై నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాల శ్రీనివాసచార్యుల పేటలో నిర్వహించి శుక్రవారం మాట్లాడారు. ఇటువంటి సెక్షన్ల ద్వారా అదనపు ఆదాయం వస్తుందని సుకుమార్ డీజీఎం సిడ్బి బ్యాంకు తెలిపారు. శ్రీనివా సచార్యుల పేట గ్రామంలో సిడ్బి బ్యాంక్ సహకారంతో ఆర్ట్స్ సంస్థ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈయన మాట్లాడుతూ మహిళలకు ఈ శిక్షణ ఎంత ఉపయోగపడుతుందని వారికి అదనపు ఆదాయము వచ్చే టందుకు ఉపయోగ పడుతుందని శిక్షణ అనంతరం యూనిట్ ఏర్పాటు చేసుకుంటే మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 60 మంది మహిళలకు బ్లాక్ పెయింటింగ్ మరియు మగ్గం వర్కులు తయారీలో శిక్షణ అందించారు. ఇటువంటి శిక్షణలకు మంచి గిరాకీ ఉందని ప్రస్తుతం ఉన్న ఫ్యాషన్ కి ఈ శిక్షణ ఎంతో ఉపయోగ పడుతుందని మహిళ లందరూ నేర్చుకోవాలని డైరెక్టర్ నూక సన్యాసిరావు వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వాసు భీమవరం అప్పల నాయుడు సీఈవో చిక్కులు చేనేత కంపెనీ మరియు బి శంకర్రావు సీఈవో మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ సిహెచ్ సూర్యనారాయణ సీఈవో గ్రామీణ సహజ రైతు ఉత్పాదనలు కంపెనీ మరియు మహిళలు ఆర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఉపాధ్యాయుల సేవలు మరువలేనని దండు గోపాలపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకోత చైతన్య అన్నారు. బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్ళిన ఉపాధ్యాయులు, సిబ్బందికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ అనేది ఉద్యోగములో ఒక భాగమని, వీరంతా తమవృత్తిని దైవంగా భావించి తమతమ విధులను నిర్వర్తించేవారిని, మీరు విద్యార్థులతో ఎంతో మమేకమై ఉండేవారిని అన్నారు. నిరంతరము పాటశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి కృషిచేసే వారని మీసేవలు మరువలేనివి కొనియాడారు. ఉపాధ్యాయులు ప్రతీ ఒక్కరూ వారితో గల అనుబంధమును, అనుభూతులను, అనుభవాలను తెలియచేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు, క్రిష్ణవేణి, గిరి, రోజా, దయాసాగర్ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.